సిద్దిపేటలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

అన్నిరంగాల్లో సాధికారత సాధించాలి

■ జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

సిద్దిపేట, ఫిబ్రవరి 14: వివిధ విభాగాల్లో సేవలందించిన వారికి మహిళా స్ఫూర్తి పురస్కార్ అందించి గౌరవించుకోవడం సంతోషంగా ఉందని, మహిళలు అన్నిరంగాల్లో సాధికారత సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ అన్నారు. యూటీ ఎంఎ రాష్ట్ర అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయశుభాకర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయిని తరుణి మహిళా అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, 4వ వార్డు కౌన్సిలర్ కొండం కవితాసంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్లు

హుస్నాబాద్ టౌన్ : కమిషనర్ మల్లికార్జున్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిషనర్‌కు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు నిరంతరం ఫాగింగ్ నిర్వహించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

దుబ్బాక కమిషనర్‌గా రమేశ్‌కుమార్

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 14 : దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా కె.రమేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన గణేశ్‌రెడ్డి అనారోగ్యంతో సెలవులో ఉండగా, గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ గత 15 రోజులుగా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. దీంతో గణేశ్‌రెడ్డి స్థానంలో కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడ కమిషనర్‌గా పనిచేస్తున్న రమేశ్‌కుమార్ దుబ్బాక కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్‌కు అధికారులు, పాలకమండలి సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా రమేశ్

చేర్యాల, ఫిబ్రవరి 14 : చేర్యాల మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, చేర్యాల ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్, తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వర్‌రావును ఉన్నతాధికారులు ఇటీవల బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ ఇటీవల నాచారం యూబీ కంపెనీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. చేర్యాల తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వర్‌రావు బదిలీపై సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా వెళ్లారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ నిజామాబాద్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లగా, ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌ను చేర్యాలకు వచ్చారు.

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్నరాణి

సిద్దిపేట, ఫిబ్రవరి 14 : మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్ నల్గొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసన్నరాణి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఇక్కడకు వచ్చారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లాలోని పలు మండలాలకు బదిలీపై వచ్చిన ఎంపీడీవోలు, ఎస్సైలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని మందాపూర్‌లో బుధవారం నబిషిల బొడ్డాయి, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుల మధ్య నృత్యాలు చేస్తూ బోనాలు తీసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాలకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామస్తులు సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీ కిరణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భిక్షపతి, సుధాకర్, ఆంజనేయులు, నర్ర నర్సింహులు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ ■ రోడ్డు నిబంధనలపై అవగాహన ర్యాలీలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 14 : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులతో కలిసి బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భద్రతా మాసోత్సవాలను ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, అందుకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమన్నారు. ఇష్టారీతిగా వాహనాలను పార్కింగ్ చేయొద్దని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎంవీఐ జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్స్ రూల్స్ అతిక్రమిస్తే కేసులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 14 : ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై షేక్ యూనూస్ అహ్మద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా ధూళిమిట్ట మండలం బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లో ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు లేకపోతే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపకూడదన్నారు.

సిద్దిపేటలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న వాహనదారులు, పోలీసులు

హెల్మెట్ ధరించాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 14 : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని భూంపల్లి ఎస్సై భువనేశ్వర్‌రావు అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి చౌరస్తాలో పోలీసులు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 14 : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. బుధవారం ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌పై నిబంధనల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. పట్టణంలోని జాలిగామ రోడ్డులో సీఐ బి.సైదా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో..

హుస్నాబాద్, ఫిబ్రవరి 14: రోడ్డు భద్రతా నిబంధనలను డ్రైవర్లు విధిగా పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్సై తోట మహేశ్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డ్రైవర్లు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. వాహనదారులు రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేయడంతో మిగతా వారికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

సాయిబాబాకు పూజలు చేస్తున్న మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంశీధర్‌రావు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 14 : సిద్దిపేట సాయి విద్యానగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరుగుతుంది. అందులో భాగంగా వసంత పంచమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సాయిబాబాకు ప్రత్యేక అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. వేడుకల్లో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జీ కల్వకుంట్ల వంశీధర్‌రావు పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

'కొండపోచమ్మ' ఆదాయం రూ.12 లక్షలు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 14 : భక్తుల కొంగుబంగారం తిగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. 59 రోజులకు రూ.12 లక్షల 23 వేల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. జాతర సమయంలో భక్తులు హుండీలో వేసిన డబ్బులను దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నృహింహస్వామి వార్షికోత్సవాలు

కొమురవెల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని మర్రిముచ్చాల సాంద్రానంద క్షేత్రంలో ఆశ్రమ నిర్వాహకుడు గౌరిభట్ల శ్రీనాథశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శేషశర్మ వైదిక నిర్వహణలో నృహింహస్వామి వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం సాంద్రానందస్వామి మూల విరాట్‌కు విశేష అభిషేకం చేశారు. స్వామివారి పాదపూజ మహోత్సవం, పూర్ణాహుతి, బలిప్రదానం, నీరజనము, మంత్రపుష్పం, రుత్విక్ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథశర్మ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ఏటా వార్షికోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

సాంద్రానంద ఆశ్రమంలో పూజలు చేస్తున్న వేదపండితులు

జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్నది కాంగ్రెస్సే

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 14 : జర్నలిస్టులపై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని టీఎస్-24 న్యూస్ నిర్వాహక జర్నలిస్టు ఆకుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఛానల్ ద్వారా వాస్తవాలు ప్రసారం చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యమ నేతలను ఇంతకన్న దారుణంగా అసభ్య పదజాలంతో యూటూబ్ ఛానల్ నిర్వాహకుడు మల్లన్న తిడుతూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మల్లన్నకు పార్టీ కండువా కప్పి ప్రచారంలో వాడుకుందని, వందలాది మందిని తిట్టించినప్పుడు లేవని నోర్లు ఇప్పుడెందుకు లేస్తున్నాయని ప్రశ్నించారు. తెలంగాణపై విషయం కక్కుతున్నది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే కదా..? అని మండిపడ్డారు. నిజాలను నిర్భయంగా ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు.

జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య

తొగుట, ఫిబ్రవరి 14: జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అని తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు ఊల్లెంగల సాయికుమార్ అన్నారు. బుధవారం తొగుట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో మట్టి మాఫియాపై వార్త రాసిన విలేకరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మంద సునీత, W/o రమేష్, R/o. అనంతగిరి గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం దీని యొక్క ప్లాట్ నెంబరు 45 లోని కొంత భాగం దీని యొక్క విస్తీర్ణం: 178.25 చ.గజాలు, దీనియొక్క సర్వే నెంబర్లు 601,602 & 604 బెజ్జంకి గ్రామం మరియు మండలం సిద్దిపేట జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 15-02-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

గజ్వేల్ ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ముంపు బాధితులకు ఉపాధి కల్పించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 14: మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ముంపు గ్రామాల కూలీలతో కలిసి ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏటిగడ్డకిష్టాపూర్‌లో 1553, లక్ష్మాపూర్‌లో 200, ఎర్రవల్లి, సింగారం, వేములఘాట్ గ్రామాల్లో 1600, బ్రహ్మణ బంజేరుపల్లిలో 453, పల్లెపహాడ్‌లో 1169, రాంపూర్‌లో 236 మందికి జాబ్ కార్డులున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆయా గ్రామాల కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో జయపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆయా గ్రామాల కూలీలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ సిబ్బందిని నిర్బంధించిన గ్రామస్తులు

బెజ్జంకి, ఫిబ్రవరి 14 : మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో నిర్మించే ఇథనాల్ ఫ్యాక్టరీ సిబ్బందిని బుధవారం గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. గ్రామంలో ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిబ్బందిని నిర్బంధించి మందు డబ్బాలతో గ్రామస్తులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. మరోవైపు గ్రామంలో దుర్వాసన వస్తుందని రైస్ మిల్లు వద్ద గ్రామస్తులు నిరసన తెలిపారు.

గ్రామ పంచాయతీలో ఫ్యాక్టరీ సిబ్బంది

నిషేధిత పేలుడు పదార్థాల పట్టివేత

కోహెడ, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో ఓ వెంచర్‌లో అక్రమంగా నిషేధిత పేలుడు పదార్థాలు నిల్వ చేశారనే సమాచారంతో బుధవారం హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, కోహెడ ఎస్సై తిరుపతి దాడులు నిర్వహించి 97 జిలెటిన్ స్టిక్స్, 100 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు కరీంనగర్‌కు చెందిన ఒర్సు నర్సయ్యకు చెందినవని, అతడు పరారీలో ఉన్నట్లు సీఐ కిరణ్ తెలిపారు. ఎవరైనా పేలుడు పదార్థాలు నిల్వ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా

ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : హుస్నాబాద్ సమీకృత భవన సముదాయం(ఐవోసీ) ఎదుట బుధవారం మండలంలోని పోతారం(ఎస్), వంగరామయ్యపల్లికి చెందిన పలువురు బాధితులు ధర్నా నిర్వహించారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములు, ఇండ్లను కొందరు ప్రైవేట్ వ్యక్తులు హద్దులు తెలియకుండా పట్టాలు చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

నాణేలతో సరస్వతీ మాత

గజ్వేల్, ఫిబ్రవరి 14 : వసంత పంచమిని పురస్కరించుకొని బుధవారం గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు రూ.16 వేల నాణేలతో 10 అడుగుల పొడవైన సరస్వతీ అమ్మవారి చిత్రాన్ని రూపొందించారు. మూడు రోజులపాటు శ్రమించి అమ్మవారి చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు.

మహానంది అవార్డు గ్రహీతకు సన్మానం

మహేశ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : మహానంది జాతీయ పురస్కార్ గ్రహీత తూర్పాటి మహేశ్‌ను బుధవారం హుస్నాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఏపీకి చెందిన తెలుగు సాంస్కృతిక సాహితీ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయులు, వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా మహేశ్‌కు మహానంది జాతీయ పురస్కారం, వాస్తువిద్యాభూషన్ బిరుదు ప్రదానం చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో వాస్తుజ్యోతిష్యంలో డిప్లొమా పూర్తిచేసిన మహేశ్ అత్యున్నత పురస్కారం అందుకోవడం గర్వకారణమని భార్గవపురం సేవా సమితి అధ్యక్షుడు చిట్టి గోపాల్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, కౌన్సిలర్ శ్రీనివాస్, టీవీ జర్నలిస్టు దాక్షాయని, కవి వడ్డెపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పాండిచ్చేరిలో విద్యార్థి మృతి

గజ్వేల్, ఫిబ్రవరి 14: గుండెపోటుతో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందిన ఘటన పాండిచ్చేరిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తొగుట మండలం బ్రహ్మణ బంజేరుపల్లి గ్రామానికి చెందిన పురోహితుడు పద్మనాభశర్మ కుమారుడు కొరిడే అనిరుధ్‌శర్మ(22) పాండిచ్చేరి టెక్నాలజీ యూనివర్సిటీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి రుధ్‌శర్మ గుండెపోటుతో మృతి చెందాడు. పాండిచ్చేరిలో పోస్టుమార్టం పూర్తవడంతో మృతదేహాన్ని గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తీసుకొస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం బ్రహ్మణ బంజేరుపల్లిలో దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసులకు సహకరించాలి

మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 14 : దొంగతనాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ ఎల్.శ్రీను కోరారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో చేర్యాల ఎస్సై దామోదర్‌తో కలిసి సీఐ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల మండలం తాడూరు, కొమురవెల్లి మండలం గౌరాయపల్లి, మద్దూరు మండల కేంద్రంలో ఇటీవల చోరీలు జరిగాయని చెప్పారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లను దుండగులు గుర్తించి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇండ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో ఇరుగుపొరుగు వారికి, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే తాము రక్షణ కల్పిస్తామన్నారు. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంటే బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలన్నారు. చోరీలు జరిగిన గ్రామాల్లో క్లూస్ టీంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా చేర్యాల పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసహనం

గజ్వేల్ మండల సమావేశంలో సభ్యులు

గజ్వేల్, ఫిబ్రవరి 14 : మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడంతో ఎంపీపీ దాసరి అమరావతి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి సంబంధిత అధికారులు హాజరుకాకపోవడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైనవారందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదన్నారు. సమావేశం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఏడు సార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని హుస్నాబాద్ రైతు ఐక్యత సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు పండించే 22 రకాల పంటలకు మద్దతు ధర నిర్ణయించాలన్నారు. ఢిల్లీ సమీపంలో రైతులు చేసిన ఆందోళనలపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 16న భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

రాయపోల్, ఫిబ్రవరి 14 : యాజమాన్య పద్ధతులను రైతులు కచ్చితంగా పాటించాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ బాబు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రాయపోల్, తిమ్మక్కపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాబునాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువ వాడితే వరి పంటకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏఈవో ప్రశాంత్, రైతులు ఉన్నారు.

కొత్తపల్లిలో వరిని పరిశీలిస్తున్న అధికారులు

కొలతలు వేస్తున్న అధికారులు

ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 14 : మద్దూరు మండం వల్లంపట్ల ఆంజనేయస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు బుధవారం సందర్శించారు. దేవాదాయశాఖ ఏఈ రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు ఆలయ ప్రహరీ చుట్టూ కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గతేడాది సర్పంచ్ ఆలేటి రజితాయాదగిరి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి దేవాదాయశాఖకు అందించినట్లు తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాన్ని సందర్శించి, ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులకు అయ్యే ఖర్చులను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ ఆలేటి రజితాయాదగిరి, అధికారులు వెంకటేశ్వర్లు, గ్రామస్తులు ఉన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని జిల్లెలగడ్డ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 17 మంది ప్రవేశానికి అర్హత సాధించారు. గురుకుల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చడంతో గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ డీఎస్ వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ మధు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

హుస్నాబాద్, ఫిబ్రవరి 14: నేడు బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించనున్నట్లు గిరిజన సంఘాల నాయకులు బీలూనాయక్, రూప్‌సింగ్, రాంబాబునాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని బంజారాభవన్ వద్ద గురువారం ఉదయం 8 గంటలకు ఉత్సవాలు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గిరిజన, బంజారా నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.